ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





## ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

వికారాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దివ్యాంగ విద్యార్థులు ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం జనవరి 15 వరకు దరఖాస్తు చేసుకోవాలని దివ్యాంగుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి కృష్ణవేణి ప్రకటనలో తెలిపారు. వివరాలతో తెలంగాణ ఈపాస్.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. తర్వాత సంబంధిత ధ్రువపత్రాలను జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు 9502912981 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలేవి?

కుక్కలు, పశువులు, పందుల సంచారం

రక్షణ చర్యలు చేపట్టని అధికారులు

ఇబ్బందుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

8



## 'సర్వే'లో సమగ్ర వివరాలు సేకరించాలి

లబ్ధిదారులు పూర్తి సమాచారం ఇవ్వాలి

31వ తేదీవరకు సర్వే పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ రాధిక గుప్తా

7



## వణికిస్తున్న చలి



రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వారం రోజుల నుంచి చలి చంపేస్తుంది. గురువారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం రెడ్డిపల్లిలో 10.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో 11 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మూడు చింతలపల్లిలోని కేసవరంలో 12.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.



వికారాబాద్‌లో వంటావార్పు నిర్వహించి భోజనం చేస్తున్న ఉద్యోగులు

## విద్యాశాఖలో విలీనం చేయాలి

» వంటావార్పుతో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

వికారాబాద్, డిసెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని జిల్లా అధ్యక్షుడు గంగ్యా నాయక్ డిమాండ్ చేశారు. అప్పటి వరకు పేస్కేల్ అమలు చేయాలన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సర్వ శిక్ష ఉద్యోగులు చేస్తున్న నిరసనలు 14వ రోజుకు చేరాయి. గురువారం సర్వశిక్ష ఉద్యోగులు వంటావార్పు కార్యక్రమం నిర్వహించి సహపంక్తి భోజనాలు నిర్వహించారు. నిరసనలో 488 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడల్ స్కూల్‌లో సమగ్ర శిక్ష కు అనుబంధంగా పనిచేస్తున్న ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, డీపీవో శేఖర్, ఆయా మండలాల కేజీబీవీ పాఠశాల, ఎస్వోలు, సమగ్ర శిక్షా అన్ని విభాగాల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

### వెంటనే రెగ్యులరైజ్ చేయాలి

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): తమను వెంటనే రెగ్యులరైజ్ చేయాలంటూ సర్వశిక్ష ఉద్యోగులు విధులకు హాజరుకాకుండా గురువారం మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 85 మంది ఉద్యోగులు సమ్మె బాట పట్టారు. దీంతో విద్యాశాఖలో విద్యాశాఖలో పనులకు ఆటంకం ఏర్పడుతోంది. విద్యాశాఖలో సమగ్ర శిక్షా సిబ్బంది జిల్లా స్థాయిలో ఏపీవోలు, డీపీఓలు, సాంకేతిక నిపుణులుగా, మండల స్థాయిలో కంప్యూటర్ ఆపరేటర్లుగా, భవిత కేంద్రాల్లో ఉపాధ్యాయులుగా, రిసోర్స్ పర్సన్లుగా తదితర విధుల్లో పనులు నిర్వహిస్తున్నారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని, వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఎమ్మార్సీ కార్యాలయాల్లో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెలో ఉండటంతో పనుల నిమిత్తం వస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, బిల్లుల మంజూరు కోసం భోజన నిర్వాకులు ఇబ్బందులు పడుతున్నారు.



మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

**జిల్లాలో రేషన్ కార్డులు**

| | |
|---|---|
| ఆహార భద్రత | 2,14,503 |
| అంత్యోదయ | 26,640 |
| అన్నపూర్ణ | 36 |
| మొత్తం | 2,41,179 |

రేషన్ కార్డుల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదల్లో మంత్రి ఉత్తమ్‌కుమార్ ప్రకటనతో ఆశలు చిగురిస్తున్నాయి. సంక్రాంతి పండగకు కొత్త రేషన్ కార్డులు ఇస్తామని ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ సర్కార్ వచ్చిన తర్వాత నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో కార్డులు లేని పేద ప్రజలు వార్డు, గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకున్నారు. 2014 నుంచి 2024 వరకు పౌర సరఫరాల శాఖ పోర్టల్‌లో మార్పులు, చేర్పుల కోసం 26 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే కొత్త కార్డులకు 40వేల మంది ఎదురుచూస్తున్నారు. కాగా, ఇప్పటికే జిల్లాలో 2,41,179 రేషన్‌కార్డులు ఉన్నాయి.



# చిగురిస్తున్న ఆశలు!

## 'సంక్రాంతి'కి కొత్త రేషన్ కార్డులు

విధివిధానాలకు సబ్‌కమిటీ ఏర్పాటు

జిల్లాలో 40వేల మంది ఎదురుచూపు

పెండింగ్‌లో 26 వేల దరఖాస్తులు

కార్డులు లేక అందని సంక్షేమ పథకాలు

మార్పులు, చేర్పులకు సైతం లేని అవకాశం



వికారాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అర్హులైన వారికి నూతన రేషన్ కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. సంక్రాంతి పండగ నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు ఇప్పటికే ప్రభుత్వ వర్గాల నుంచి తెలుస్తోంది. అర్హులకు కొత్త రేషన్ కార్డులు జారీ చేసేందుకు విధి విధానాల రూపకల్పనకు అయిదు నెలల కిందట ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీని నియమించిన విషయం తెలిసిందే. గత నెలలో నిర్వహించిన సమగ్ర సర్వే ద్వారా వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచింది. దరఖాస్తుదారుల్లో అర్హులను గుర్తించేందుకు 360 డిగ్రీల సాఫ్ట్‌వేర్ సిద్ధంగా ఉంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత 2018, 2022లో అర్హులుగా గుర్తించిన వారికి రేషన్ కార్డులు జారీ చేశారు. ఆ తర్వాత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు జారీ చేయకపోవడంతో పేద ప్రజలు ప్రభుత్వ పథకాలకు నోచుకోవడం లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచింది. కొత్త రేషన్ కార్డుల జారీపై ప్రభుత్వం ప్రకటన చేయకపోవడంతో ఆశావహులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు కొత్త రేషన్ కార్డుల జారీపై

మిగతా 8వ పేజీలో...

### కార్డుల్లో పేర్ల తొలగింపు

2014, డిసెంబరు 31 నుంచి 2024, జూలై 10వ తేదీ వరకు పౌర సరఫరాల శాఖ పోర్టల్‌లో కొత్త రేషన్ కార్డులు, మార్పులు, చేర్పుల కోసం 26 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. రేషన్ కార్డుల్లో పేర్లు తొలగిస్తున్న అధికారులు కొత్త వారి పేర్లను మాత్రం చేర్చడం లేదు. కూతురు వివాహం కాగానే పుట్టింటి వారి రేషన్ కార్డులో నుంచి ఆమె పేరు తొలగిస్తున్న అధికారులు అత్తింటి వారి రేషన్ కార్డులో మాత్రం చేర్చడం లేదు. ఫలితంగా పుట్టింటి నుంచి అత్తవారింటికి వెళ్లే కోడళ్లు రేషన్ కోటా పొందలేకపోతున్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

## నాణ్యమైన భోజనం అందించాలి

కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్‌లో హాస్టళ్ల తనిఖీ

వికారాబాద్, డిసెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. గురువారం వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీ 1, 2 వసతి గృహాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహాల చుట్టు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వంటగదిలో బియ్యం, పప్పులను, కూరగాయాలను, పరిసరాలను పరిశీలించారు. ప్రతీ రోజు టిఫిన్, భోజనం ఎలా పెడుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారం విషయంలో శుచి శుభ్రత పాటించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాత్ రూమ్‌లను పరిశీలించి పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వసతి గృహాల్లో మేజర్, మైనర్ రిపేర్ పనులు ఎంత వరకు పూర్తి చేశారని వార్డెన్లను అడిగి తెలుసుకున్నారు. అన్ని పనులు పూర్తి చేసి రిపేర్‌కు ముందు ఫొటోలు, తర్వాత ఫొటోలు పంపించాలని తెలిపారు. విద్యార్థులు చదువుతున్న క్లాస్ రూమ్‌కి వెళ్లి చదువుతున్న తీరును పరిశీలించారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులతో మాట్లాడుతూ బాగా చదివి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి మల్లేశం, వార్డెన్లు రత్నం, రవీందర్, సుక్లవర్ధన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# కానిస్టేబుల్‌కు అండగా ఎక్సైజ్ శాఖ

సాయంగా ఉద్యోగుల ఒకరోజు వేతనం • రూ.8,02,177 చెక్కు అందజేత



కానిస్టేబుల్ సురేందర్ తల్లిదండ్రులకు చెక్కు అందజేస్తున్న ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్, ఉద్యోగులు

వికారాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఎక్సైజ్ కానిస్టేబుల్‌కు అండగా నిలబడ్డారు ఆ శాఖ ఉద్యోగులు, ఉన్నతాధికారులు. కానిస్టేబుల్ స్థాయి నుంచి డిప్యూటీ కమిషనర్ వరకు అందరూ తమ ఒకరోజు వేతనాన్ని బాధిత కానిస్టేబుల్ కుటుంబానికి అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

వికారాబాద్ మండలం, కొటాలగూడ గ్రామానికి చెందిన సురేందర్ వికారాబాద్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన నవంబరు ఒకటో తేదీ రాత్రి వికారాబాద్ నుంచి తన గ్రామానికి బైక్‌పైన వెళుతున్న సమయంలో గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సురేందర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సురేందర్‌కు ఇప్పటికే రెండుసార్లు శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఇంకా మోకాలి చిప్ప మార్పిడి చేయాల్సి ఉందని డాక్టర్లు చెప్పడంతో సురేందర్ తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. సురేందర్ చికిత్స కోసం ఇప్పటికే బాగా ఖర్చు చేసిన తల్లిదండ్రులు .. వైద్యం, ఆసుపత్రి ఖర్చుల కోసం ఎక్కడ నుంచి అప్పు తీసుకు రావాలో తెలియక తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సురేందర్ ఆరోగ్య పరిస్థితి గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రాగవీణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్‌గౌడ్ సురేందర్‌కు అండగా నిలవాలనుకున్నారు. ఈ విషయాన్ని రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ దశరథ్ దృష్టికి తీసుకువచ్చారు.

### ఆబ్కారీ భవన్‌లో చెక్కు అందజేత

వెంటనే ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోకి వచ్చే వికారాబాద్, శంషాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు చర్చించుకుని నిరుపేద కుటుంబానికి చెందిన కానిస్టేబుల్ సురేందర్‌కు అండగా నిలవాలనుకున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో ఎక్సైజ్ శాఖలో పనిచేసే కానిస్టేబుల్ నుంచి డీపీఈవోలు, రంగారెడ్డి డివిజన్ డిప్యూటీ కమిషనర్ దశరథ్ వరకు అందరూ తమ ఒక రోజు వేతనాన్ని సురేందర్‌కు సాయంగా అందించేందుకు ముందుకు వచ్చారు.



కానిస్టేబుల్ సురేందర్

సేకరించిన ఒకరోజు వేతనం మొత్తం రూ.8,02,177 చెక్కును గురువారం హైదరాబాద్‌లోని ఆబ్కారీ భవన్‌లో ఎక్సైజ్ కమిషనర్ చేవూరి హరికిరణ్, రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ దశరథ్‌ల చేతుల మీదుగా సురేందర్ తల్లిదండ్రులకు అందజేశారు. కానిస్టేబుల్ సురేందర్ కోలుకునే వరకు అండగా ఉంటామంటూ వారు హామీ ఇచ్చారు. సురేందర్‌ను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన యూనిట్ ఉన్నతాధికారుల నుంచి కానిస్టేబుళ్ల వరకు అందరికీ వికారాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్‌గౌడ్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రాగవీణ ధన్యవాదాలు తెలిపారు. బాధిత కుటుంబానికి తమ శాఖ ఉద్యోగులు ముందుకు వచ్చి ప్రకటించిన సంఘీభావం, మద్దతుకు తాము చలించిపోయామన్నారు. మీరందించింది ఆర్థిక సహాయం మాత్రమే కాదని, బాధిత సామూహిక మానవత్వానికి, ఉద్యోగుల ఐక్యతకు నిదర్శనమంటూ ఉన్నతాధికారులు అభినందించారు. ఇదిలా ఉంటే, ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ కూడా సురేందర్ తల్లిదండ్రులకు తనవంతు ఆర్థిక సాయం అందజేయడం విశేషం.





అవార్డును అందుకుంటున్న యోగేశ్వర్, వాణి కుమారి

## ఘట్‌కేసర్, పోచారం, నాగారం బల్దియాలకు జాతీయ అవార్డులు

ఢిల్లీలో అందుకున్న అధికారులు

ఘట్‌కేసర్/కీసర రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్‌లో చేంజ్ మేకర్స్ కాన్‌క్లేవ్ కార్యక్రమంలో ఘట్‌కేసర్, పోచారం, నాగారం మున్సిపాలిటీలు చేంజ్ మేకర్స్ అవార్డును దక్కించుకున్నాయి. ఢిల్లీలో గురువారం సిల్వర్ హోక్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎస్ఈ డైరెక్టర్ డాక్టర్ సునీత నుంచి ఘట్‌కేసర్ మున్సిపాలిటీ స్వచ్ఛ సర్వేక్షణ్ ఇన్‌చార్జి యోగేశ్, పోచారం మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వాణి కుమారి, నాగారం పర్యావరణ ఇంజనీర్ ప్రశాంత్ ఈ అవార్డులను అందుకున్నారు. ప్రధానంగా చెత్తతో నూతన వస్తువుల తయారు చేయడం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మున్సిపాలిటీలకు ఈ అవార్డులను అందజేశారు. ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలకు అవార్డులు రావడం పట్ల చైర్‌పర్సన్లు ముల్లి పావని, బోయపల్లి కొండల్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కాగా, ఈ అవార్డులు దమ్మాయిగూడ, ఆదిబట్ల, మణికొండ, గుండ్లపోచంపల్లి, పీర్జాదిగూడ, అమీన్‌పూర్, తుర్కయంజాల్, శంషాబాద్, నార్సింగి, కొంపల్లి తదితర మున్సిపాలిటీలను సైతం వరించాయి.

# 15,596 ఎకరాల్లో సాగు



13,788 ఎకరాల్లో వరి సాగు

1,795 ఎకరాల్లో ఉద్యాన పంటలు

అందుబాటులో విత్తనాలు, ఎరువులు

పనులు ప్రారంభించిన రైతులు

## యాసంగి యాక్షన్ ప్లాన్ సిద్ధం

| విత్తనాలు (క్వింటాళ్లలో) | | ఎరువులు (మెట్రిక్ టన్నుల్లో) | |
|---|---|---|---|
| వరి | 11,241 | యూరియా | 2,300 |
| మొక్కజొన్న | 11 | డీఏపీ | 635 |
| జవార్ | 14 | కాంప్లెక్స్ | 247 |
| మొత్తం | 11,266 | మొత్తం | 3,182 |

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో యాసంగి యాక్షన్‌ప్లాన్‌ను అధికారులకు సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా 24 వేల మంది 15,596 ఎకరాల్లో పలు రకాల పంటలు సాగు కానున్నట్లు వ్యవసాయాధికారులు అంచనాలను సిద్ధం చేశారు. అందుకనుగుణంగా అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను రైతులకు అందుబాటులో ఉంచే విధంగా ప్రణాళికను తయారు చేశారు. జిల్లాలో అధికంగా

మిగతా 8వ పేజీలో...



డీపీవో ఆఫీస్ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

## పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లాలోని కార్మికులు జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి డీపీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మిక, ఉద్యోగ సంఘాల జేఏసీతో చర్చలు జరపాలని ఈ నెల 6న ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ స్పందించలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన పోరాటాలతో పాటు ఈ నెల 27, 28 తేదీలలో రెండు రోజుల పాటు టోకెన్ సమ్మెకు వెళ్తాన్నామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి ఉన్ని క్రిష్ణన్, నాయకులు పోచయ్య, కృష్ణ, రమేష్, ప్రశాంత్, యాదయ్య, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ

కొడంగల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ మండలంలోని అప్పాయిపల్లి గ్రామ శివారులో మెడికల్, వెటర్నరీ కళాశాలల నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు గురువారం కొడంగల్ తహసీల్దార్ విజయ్‌కుమార్ ఇళ్ల స్థలాలకు సంబంధించిన లేఅవుట్‌తో రిజిస్ట్రేషన్ చేసి పట్టాలు అందించారు. సర్వే నంబర్ 19లో డీటీసీపీ లేఅవుట్ ద్వారా ప్రభుత్వం 125 గజాల స్థలం చొప్పున 51 మంది రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సబ్ రిజిస్టర్ రవికాంత్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



పట్టాలు అందిస్తున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

# బొడ్రాయికి ఘన పూజలు

శామీర్‌పేట, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శామీర్‌పేట గ్రామంలో గురువారం బొడ్రాయి(నాభిశిల) రెండో వార్షిక మహోత్సవం పెద్ద చెరువు కట్టమైసమ్మ ఆలయం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కమిటీ చైర్మన్ అశోక్, సభ్యులు, భక్తులు బొడ్రాయికి భక్తిశ్రద్ధలతో జలాన్ని పోసి ప్రత్యేక అభిషేకాలను, పూజలు చేశారు. అలాగే గ్రామ దేవతలకు యజ్ఞహోమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన పండిత వేదబ్రహ్మణులు మురళీధర్‌శర్మ, ఇతర పండితులు వేదమంత్రోశ్చరణలతో బొడ్రాయికి, గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని మహిళలు విచ్చేసి బొడ్రాయికి, గ్రామ దేవతలకు జలాలను పోసి ప్రత్యేక అభిషేకాలను, పూజలను చేసిన మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం మధ్యాహ్నం కట్టమైసమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.



యజ్ఞహోమాన్ని నిర్వహిస్తున్న కట్టమైసమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు అశోక్, నాయకులు

## మతం మారిన వారికి 'ఎస్సీ' హక్కులు వర్తింపచేయొద్దు

ఆమనగల్లు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ నుంచి ఇతర మతంలోకి మారిన వారికి ఎస్సీ లకు కల్పించిన హక్కులు వర్తింపజేయవద్దని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పుల నర్సింహ కోరారు. ఈ మేరకు గురువారం నగరంలో ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మతం మారిన వారికి అంతకుముందు ఉన్న కులంలోని వ్యక్తులకు వర్తించే హక్కులను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించొద్దన్నారు. ఎస్సీల హక్కులను కాలరాస్తే జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు.

## పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి



ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు

చౌదరిగూడ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో పేదల నుంచి డబ్బు డిమాండ్ చేస్తున్న జిల్లేడు పంచాయతీ కార్యదర్శి సమతపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు గురువారం ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ప్రభాకర్, మహేష్, వెంకటేష్, బాలమణి, సునీత మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల కమిటీలో సభ్యుల ప్రమేయం లేకుండా.. అర్హులైన పేదల నుంచి ఇళ్ల సర్వే చేయడానికి డబ్బులు డిమాండ్ చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అలాగే ఇంటి పర్మిషన్లు మంజూరు చేయడానికి కూడా డబ్బులు డిమాండ్ చేస్తుందన్నారు. గ్రామ పంచాయతీకి చెందిన బోరు మోటర్‌ను విక్రయించడంతో పాటు పంచాయతీ నిధుల్లో కూడా అక్రమాలకు పాల్పడుతున్నారని, ఇదేమిటని ప్రశ్నిస్తే దురుసుగా ప్రవర్తిస్తుందని వారు తెలిపారు.

## కాటన్ మిల్లులో పత్తి తూకం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ధారూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'మిల్లు వద్ద పత్తి.. రైతుల ఆందోళన' అనే శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. మండల పరిధిలోని నాగసముందర్ గ్రామ శివారులో సాయిబాబా పత్తి మిల్లుకు రైతులు తెచ్చిన 75 పత్తి వాహనాలకు టోకెన్లు జారీచేసి తూకం వేయించి కొనుగోలు చేయించామని ధారూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కె.విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ అధికారి సిద్ధమ్మ తెలిపారు. మిల్లులో పత్తినిల్వలు నిండిపోయి స్థలంలేనందున మూడు రోజుల పాటు మిల్లును మూసివేస్తున్నామని మార్కెట్ అధికారి సిద్ధమ్మ తెలిపారు.

## ఇంధనాన్ని పొదుపుగా వాడుకోవాలి



విద్యార్థులకు జ్ఞాపిక అందిస్తున్న పవన్‌చందు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇంధనాన్ని పొదుపుగా వాడుకోవాలని తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధనవనరుల సంస్థ జిల్లా మేనేజర్ పవన్‌చందు తెలిపారు. ఇంధనపొదుపు వారోత్సవాల్లో భాగంగా పోచారం మున్సిపాలిటీ, కొర్రెముల జిల్లాపరిషత్ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి, ఇంధనం పొదుపుపై అవగాహన కల్పించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆయన జ్ఞాపికలు అందజేశారు. హెచ్‌ఎం వరలక్ష్మి, ఉపాధ్యాయులు వెంకటయ్య, శంకరయ్య, బాలరాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.15లక్షలతో అభివృద్ధి పనులు



పనులను ప్రారంభిస్తున్న చంద్రారెడ్డి

కీసర రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): నాగారం మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి తెలిపారు. గురువారం 5వ వార్డులో రూ.15లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేసారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ అన్నంరాజ్ లావణ్య, నాయకులు అన్నంరాజ్ శ్రీనివాస్, స్థానికులు సత్తయ్య, నాగార్జున, వేణుగోపాల్, జంగారెడ్డి, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేపట్టొద్దు



ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగింపజేస్తున్న పోలీస్‌లు

చేవెళ్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పట్టణ కేంద్రంలో ప్రధాన రోడ్ల వెంబడి ఫుట్‌పాతులు ఆక్రమించి వ్యాపారాలు చేస్తూ వాహనదారులకు ఇబ్బంది కల్గిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం తెలిపారు. గురువారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో ప్రధాన రోడ్ల వెంబడి ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తున్న వారిని కలిసి అవగాహన కల్పించారు. కేవలం ఖాళీ స్థలంలోనే వ్యాపారం చేయాలని, పండ్ల బండ్లు, చాయ్, కూరగాయల దుకాణాలు, డబ్బాలు వంటివి ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని సూచించారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కూరగాయలను రైతుబజార్‌లోనే విక్రయించాలని సూచించారు. ఏఎస్సైలు చందర్, అశోక్, ట్రాఫిక్ పోలీస్‌లు సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులు సకాలంలో రుణాలు చెల్లించాలి



కందవాడలో మాట్లాడుతున్న ఎస్బీఐ ఆర్ఎం పల్లం రాజు

చేవెళ్ల, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతులు సకాలంలో పంట రుణాలు చెల్లించి రెన్యూవల్ చేసుకుంటే వడ్డీలో రాయితీ పొందవచ్చని ఎస్బీఐ రీజినల్ మేనేజర్ పల్లం రాజు తెలిపారు. గురువారం చేవెళ్ల మండల పరిధిలోని కందవాడ గ్రామంలో ఎస్బీఐ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే వడ్డీలో కొంత వరకు రాయితీ పొందవచ్చని తెలిపారు. రైతులకు ఉపయోగపడే వివిధ రకాల బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురికి మంజూరైన లోన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్బీఐ ఛీఫ్ మేనేజర్ తరుణ్‌సింగ్, చేవెళ్ల మేనేజర్ సంధ్యారెడ్డి, మాజీ ఎంపీసీటీ రవీందర్, బ్యాంకు అధికారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 'బస్సుజాత'ను విజయవంతం చేయాలి

పరిగి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్ల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన బస్సుజాత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. బస్సుజాతకు సంబంధించిన పోస్టలర్లను గురువారం పరిగిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డిసెంబరు 15న ప్రారంభమైన బస్సుజాత రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తుందని తెలిపారు. ఈ నెల 21న ఆశావర్కర్ల బస్సుజాత కార్యక్రమం పరిగికి వస్తుందని తెలిపారు. ఆశాలకు నెలకు రూ.18వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించి,కంటి వెలుగు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అశవర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మంగమ్మ, నాయకులు పద్మ,అనసూయ,స్వరూప,రాధ తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌పై కేసు కుట్రపూరితం

### కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఫార్ములా వన్ కార్‌రేస్ విషయంలో కేవలం అభియోగాలతోనే కేసు నమోదు చేయడం అన్యాయమని, కుట్రపూరితం అని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. గతంలోనే కేటీఆర్ ఈ అంశంపై శాసనసభలో చర్చ పెట్టాలని కోరారని, దీనికి సమాధానం చెప్పేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపినట్లు గుర్తుచేశారు. ఆమనగల్లులో గురువారం జైపాల్‌యాదవ్ విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్‌పై కేసు కాంగ్రెస్ ప్రభుత్వ కక్షసాధింపు చర్యలో భాగమన్నారు. దీనిపై శాసనసభలో సవివరమైన చర్చ జరిగితే నిజానిజాలేమిటో నిగ్గుతేలుతాయన్నారు. ఈ కేసు విషయంలో కేవలం అపోహలు సృష్టించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఈ కేసు గురించి అనేక రకాల అవాస్తవాలను ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మీడియాకు ఇస్తున్నారని ఆరోపించారు.

## నేషనల్ హ్యాకథాన్‌లో 'సెయింట్ పీటర్స్' విద్యార్థుల హవా



హ్యాకథాన్‌లో సెయింట్ పీటర్స్ కాలేజీ విద్యార్థులు

మేడ్చల్ టౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ ఇండియా-2024లో భాగంగా 36 అవర్స్ జాతీయ హ్యాకథాన్‌లో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ కళాశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. మైసూరులో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు తమ అనుభవాలతో పలు ప్రదర్శనలు ఇచ్చారు. ల్యాప్‌టాప్ వినియోగంలో అత్యాధునిక పద్ధతులను వివరించడంతో పాటు కీబోర్డు, మౌస్ లేకుండా ల్యాప్‌టాప్ వినియోగించటం, దాని వల్ల కలిగే ప్రయోజనాల పట్ల ప్రత్యేక ప్రాజెక్టును విద్యార్థులు చేసి చూపించారు. ఈమేరకు విద్యార్థులకు నిర్వాహకులు ప్రత్యేకంగా ప్రశంసా పత్రాలను అందజేశారు. కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, అకడమిక్ డైరెక్టర్ సరోజారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్‌రెడ్డి, పీఆర్వో రవి సుధాకర్ తదితరులు అభినందించారు.

## ఇతర రాష్ట్రాల వాహనాలను అడ్డుకోవద్దు

శంకర్‌పల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రైవేట్ డ్రైవర్లు చట్టవిరుద్ధంగా ఇతర రాష్ట్రాల వాహనాలను అడ్డుకోరాదని కొండాపూర్ ఎంవీఐకే అధికారి సునీత, శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ప్రైవేటు వాహనాలు, టాక్సీప్లేట్ వాహనాల డ్రైవర్లతో వారు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ మధ్య కాలంలో స్థానిక డ్రైవర్లు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని ఇతర రాష్ట్రాల వాహనాలను ఆపడం సరికాదన్నారు. ఎస్సై సత్యనారాయణ పాల్గొన్నారు.

## పోచారం మున్సిపాలిటీలో రూ.5.45 కోట్ల విలువైన పనులకు తీర్మానం


మాట్లాడుతున్న చైర్మన్ కొండల్‌రెడ్డి, పక్కన కమిషనర్ వీరారెడ్డి

ఘట్‌కేసర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పన్నుల వసూళ్లపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. గురువారం చైర్మన్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ప్రధానంగా యంనంపేట్‌లోని శ్రీనిధి ఇంజనీరింగ్ కళాశాల, రాక్‌వుడ్స్ ఇంటర్‌నేషనల్ స్కూల్‌కు సంబంధించిన ట్యాక్సులను రీఅసెస్మెంట్ చేయాలని తీర్మానించారు. మున్సిపాలిటీ పరిధిలో వివిధ మరమ్మతులు, పారిశుధ్య సిబ్బందికి సంబంధించిన పరికరాలతో పాటు స్టేషనరీ కొనుగోలు, విలీన గ్రామాల సిబ్బంది వేతనాల కోసం మొత్తం రూ.5.45కోట్ల పనులకు తీర్మానం చేశారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన 8వ వార్డు కౌన్సిలర్ బైర హిమ చిత్రపటానికి పూల మాలలువేసి సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ నానావత్ రెడ్డియానాయక్, కమిషనర్ వీరారెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాల భవన నిర్మాణానికి స్థల పరిశీలన


జడ్పీహెచ్ఎస్ ఆవరణలో పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

కొడంగల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నందారం ప్రశాంత్ అన్నారు. గురువారం స్థానిక జడ్పీహెచ్ఎస్(బాలికలు) ఆవరణలో సీపీఎస్, జడ్పీహెచ్ఎస్‌లకు నూతన భవనాల నిర్మాణానికి సంబంధించి స్థలాన్ని పరిశీలించారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో అరబిందో ఫార్మా కంపెనీ సహకారంతో కొడంగల్, కోస్గి మున్సిపాలిటీల్లో ప్రభుత్వ పాఠశాలల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. అలాగే కొడంగల్ జడ్పీహెచ్ఎస్(బాలుర) నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. సొంత నియోజకవర్గం కొడంగల్ సమగ్రాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నారని తెలిపారు. ఎంఈవో రాంరెడ్డి, అధికారులు, ఉపాధ్యాయులున్నారు.

## 'సర్వే'లో సమగ్ర వివరాలు సేకరించాలి


మేడ్చల్ మున్సిపల్‌లో ఇందిరమ్మ సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాధిక గుప్తా

మేడ్చల్ టౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికలో భాగంగా చేపడుతున్న సర్వేలో సమగ్ర వివరాలు సేకరించాలని అదనపు కలెక్టర్ రాధిక గుప్తా సూచించారు. గురువారం మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని 7, 8వ వార్డుల్లో నిర్వహిస్తున్న సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. సర్వేలో పూర్తి వివరాలు సేకరించినప్పుడే అర్హులైన లబ్ధిదారులకు లాభం చేకూరుతుందన్నారు. సర్వే కార్యక్రమం ఈనెల 31 వరకు పూర్తి చేయాలన్నారు. సర్వేలో భాగంగా సేకరిస్తున్న వివరాల్లో తప్పులు లేకుండా చూడాలని, అధికారులకు లబ్ధిదారులు పూర్తి వివరాలు అందజేయాలన్నారు కాగా, వివరాలు సేకరించే సమయంలో యాప్‌లో తలెత్తుతున్న టెక్నికల్ సమస్యల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారి ఇంటి వద్దకు వెళ్లి వారి స్థితిగతులను తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, చైర్‌పర్సన్ దీపికా నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

## బైపాస్ రోడ్డు సర్వేను పూర్తి చేయాలి


చెంగోల్ శివారులో బైపాస్ రోడ్డును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

తాండూరు రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): బైపాస్ రోడ్డు సర్వేను త్వరగా పూర్తి చేయాలని, ప్రజా అవసరాల కోసం రైతులు నుంచి భూములు తీసుకుంటున్నామని, వారికి పరిహారం ఇచ్చేందుకు సర్వే పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం తాండూరు మండలం చెంగోల్ గ్రామ శివారులోని బైపాస్ రోడ్డు కోసం తీసుకున్న రైతుల భూములను పరిశీలించారు. కాగా, ఇంకా 17 మంది రైతులకు పరిహారం ఇవ్వాల్సి ఉండగా, త్వరలో సర్వే నిర్వహించి అందించేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ తారాసింగ్‌ను ఆదేశించారు. రైతులు కూడా రెవెన్యూ అధికారులకు సహకరించాలని కోరారు. సర్వే నివేదిక రాగానే ప్రభుత్వం ద్వారా రైతులకు పరిహారం అందజేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. 17మంది రైతులకు పరిహారం ఇవ్వాల్సి ఉన్నందున.. వారి నుంచి ఎన్ని ఎకరాలు తీసుకున్నారనే విషయమై సమగ్రంగా సర్వే చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ గోపి, సర్వేయర్ మహేష్ రైతులు పాల్గొన్నారు.

## ప్రాజెక్ట్ బేస్డ్ లెర్నింగ్ సింపోజియంతో నైపుణ్యాలు మెరుగు


జేపీ చౌదరికి జ్ఞాపికను అందజేస్తున్న యూనివర్సిటీ చాన్స్‌లర్ యూబీ దేశాయ్, సీఈవో నీలిమా

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రాజెక్ట్ బేస్డ్ లెర్నింగ్ సింపోజియం అనేది విద్యార్థి కేంద్రీకృత విధానమని, ఇది వాస్తవ ప్రపంచ దృశ్యాలతో నిమగ్నమై ఉంటుందని, విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరుస్తుందని ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జేపీ చౌదరి అన్నారు. పోచారం మున్సిపాలిటీ వెంకటాపూర్ పరిధిలోని అనురాగ్ యూనివర్సిటీలో నిర్వహించిన ప్రాజెక్ట్ బేస్డ్ లెర్నింగ్(పీబీఎల్) సింపోజియాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాజెక్ట్ బేస్డ్ లెర్నింగ్ సింపోజియంతో విద్యార్థుల నైపుణ్యాలు మెరుగుపడుతాయని గుర్తుచేశారు. పీబీఎల్ వల్ల విద్యార్థి నూతన అవిష్కరణలు చేయడానికి తోడ్పాటునందిస్తుందని తెలిపారు. సంక్లిష్ట ఆలోచనలు, సహకారం, జ్ఞానాన్ని ఉపయోగించడంతో పాటు ఓపెన్ ఎండ్ సమస్యలను పరిష్కరిస్తుందని తెలిపారు. పీబీఎల్ ప్రపంచవ్యాప్తంగా ప్రాముఖ్యత పొందుతూ 30 దేశాల్లో అమలు చేసినట్లు గుర్తుచేశారు. అనంతరం జేపీ చౌదరికి యూనివర్సిటీ చాన్స్‌లర్ యూబీ దేశాయ్, సీఈవో సూర్యదేవర నీలిమ, ప్రతినిధులు జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో డీన్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మల్లారెడ్డిగూడ గ్రామ పంచాయతీలో నిరుపయోగంగా ఉన్న కంపోస్టు షెడ్డు

# కంపోస్టు షెడ్లు.. నిరుపయోగం

తడి, పొడి చెత్తను వేరు చేయడంలో నిర్లక్ష్యం

సేంద్రియ ఎరువు తయారీలో అలసత్వం

ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు

చేవెళ్ల, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంపోస్టు షెడ్లు నిరుపయోగంగా మారాయి. చేవెళ్ల డివిజన్ పరిధిలోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ తదితర మండలాల్లో 132 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతీ గ్రామంలో పంచాయతీ చొప్పున ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి కంపోస్టు షెడ్లు నిర్మించింది. కానీ, ప్రస్తుతం చాలా వరకు గ్రామాల్లో వాటి నిర్వహణను గాలి కొదిలేశారు. దాంతో షెడ్లన్నీ నిరుపయోగంగా ఉన్నాయి. ఉన్నతాధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో కిందిస్థాయి అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి కంపోస్టు ఎరువు తయారు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### తడి, పొడి చెత్త వేరుచేయడంలో నిర్లక్ష్యం

కంపోస్టు షెడ్లలో తడి, పొడిచెత్తను వేరు చేయడం కోసం విడివిడిగా చిన్నపాటి గదుల్లా నిర్మాణాలు చేపట్టారు. ప్లాస్టిక్ డబ్బాలు, సీసాలు, పేపర్లు, అట్టముక్కలు, కరెంటు వస్తువులు, పాత దుస్తులు ఇలా వివిధ రకాల వ్యర్థాలను వేరు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. అంతే కాకుండా ప్రజలు కూడా తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించేందుకు వీలుగా నీలి, ఆకుపచ్చ రంగుల బుట్టలను పంపిణీ చేశారు. కానీ, ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది విఫలం అయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. దాంతో తడి, పొడిచెత్తను వేరుచేయడం లేదు. ఇక కంపోస్టు షెడ్లలో సేంద్రియ ఎరువు తయారీపై పంచాయతీ కార్మికులు దృష్టి పెట్టలేకపోతున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి.

### సేంద్రియ ఎరువు తయారీపై అలసత్వం

తడి, పొడిచెత్తను విడిగా సేకరిస్తే షెడ్ల తొట్టిలో వేసి సేంద్రియ ఎరువు తయారు చేసుకోవచ్చు. ప్రతీ గ్రామ పంచాయతీలో గతంలో వానపాములు కొనుగోలు చేసేశారు. షెడ్లలో 40 నుంచి 60 రోజుల్లో ఎరువు తయారయ్యేది. ప్రారంభంలో సేంద్రియ ఎరువు తయారీ పనులు బాగానే జరిగినా ప్రస్తుతం పట్టింపులేకుండా పోయిందనే ఆరోపణలున్నాయి. కాగా, సేంద్రియ ఎరువుకు 50 కిలోల బస్తాకు రూ. 650 వరకు ధర ఉంటుంది. అదే గ్రామంలో తయారు చేస్తే రైతులకు బస్తా ఎరువు కేవలం రూ.200లకే లభిస్తుంది. దాంతో రైతులకు మేలు కలుగుతుంది. సేంద్రియ ఎరువు తయారీ చేయడం వల్ల గ్రామ పంచాయతీలకు కూడా ఆదాయం లభిస్తుంది.

### సేంద్రియ ఎరువు తయారీపై దృష్టి సారిస్తాం



తడి, పొడిచెత్తను వేరు చేసి ఇవ్వాలని ఇప్పటికే గ్రా మాల్లో ప్రజలకు అవగాహన కల్పించాం. కొన్ని జీపీల్లో తడి, పొడిచెత్త సేకరణ సాగుతోంది. తడి చెత్తను వానపాములతో కంపోస్టు షెడ్లలో వేసి సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నాం. మరోసారి అన్ని గ్రామాల్లో అవగాహన కల్పిస్తాం. పూర్తిస్థాయిలో తడి, పొడిచెత్త సేకరణతో సేంద్రియ ఎరువు తయారీకి పూర్తి స్థాయిలో దృష్టిసారిస్తాం. **- హిమబిందు, ఎంపీడీవో, చేవెళ్ల**

## విదేశీ కలుపు మొక్కల నివారణకు కృషి చేద్దాం


యువకులతో కలిసి ర్యాలీ తీస్తున్న ఈకోఫాన్ ప్రతినిధి సాయిసంపత్

బషీరాబాద్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): విదేశీ కలుపు మొక్కల నివారణకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని ఈకోఫాన్ సొసైటీ ప్రతినిధి మెట్టు సాయిసంపత్ తెలిపారు. గురువారం మండలంలోని బద్లాపూర్, కాశీంపూర్, రెడ్డిఘణాపూర్‌లో విదేశీ కలుపు మొక్కల నిర్మూలనకు తీసుకోవాల్సి చర్యలపై ర్యాలీ తీస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మట్లాడుతూ విదేశీ కలుపు మొక్కలు జీవ వైవిధ్యం, వ్యవసాయ ఉత్పాదకతకు తీవ్ర ముప్పుగా పరిణమిస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా వయ్యారిభామ, సీమ కమ్మరి, ఇగడ, బుడిది ఆకం, ముల్లపూకం, తదితర కలుపు మొక్కల వల్ల కలిగే దుష్ప్రభావంపై ప్రజలకు వివరిస్తూ చైతన్యపరిచారు. కలుపు మొక్కల నివారణకు దేశవ్యాప్తంగా సమష్టి కృషి అవసరమని సాయిసంపత్ అన్నారు. స్థానిక యువకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, రైతులున్నారు.

## కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

తలకొండపల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం గట్టిప్పలపల్లి గ్రామస్తులు 50 రోజులుగా రిలే నిరహర దీక్ష చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ గురువారం జేఏసీ నాయకులతో కలిసి బిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించారు. కిరాణ దుకాణాలు, హోటళ్లు, వ్యాపార సముదాయాల్లో బిక్షాటన చేశారు. అశోక్‌గౌడ్, శరత్‌చంద్ర, ఆంజనేయులు గౌడ్, అనిల్, చంద్రశేఖర్, విజేందర్, చంద్రయ్య చెన్నయ్య, కృష్ణ, బుచ్చయ్య పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పోరాటంతోనే లగచర్ల రైతులకు బెయిల్


దశరథ్ నాయక్

కడ్తాల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ, గిరిజన సంఘాలపోరాట ఫలితమే లగచర్ల రైతులకు బెయిల్ మంజూరు అయ్యిందని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కడ్తాల మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికార బలంతో దుర్మార్గ పాలన కొనసాగిస్తూ అమాయక రైతులపై అక్రమ కేసులు బనాయిస్తుందని ఆయన ఆరోపించారు. కడ్తాల మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లగచర్ల గిరిజన రైతులకు 40 రోజుల తర్వాత బెయిల్ మంజూరు కావడం హర్షదాయకమన్నారు. అల్లుడికి భూములు కట్టబెట్టడానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ రైతులు భూములు ఇవ్వకూడదని సూచించారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను బీఆర్ఎస్ అడ్డుకుంటుందని చెప్పారు.



అవార్డు అందుకుంటున్న ఆదిభట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, పర్యావరణ ఇంజనీర్ సురేష్

## ఆదిభట్ల మున్సిపాలిటీకి చేంజ్‌మేకర్స్ అవార్డు

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపాలిటీకి చేంజ్ మేకర్స్ అవార్డు లభించింది. 2022-24లో స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా స్వచ్ఛతా కార్యక్రమాలు, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ప్రదర్శనలు చేసినందుకు ఈ అవార్డు దక్కింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా స్వచ్ఛ కార్యక్రమాలతోపాటు సాలిడ్ మేనేజ్‌మెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మున్సిపాలిటీలకు సీఎస్ఈ, మోహువా సంయుక్తంగా గురువారం ఢిల్లీలోని సిల్వర్ హోక్ హాలులో ఏర్పాటు చేసిన చేంజ్ మేకర్స్ కార్యక్రమంలో అవార్డుల ప్రదానం చేశారు. సీఎస్ఈ డైరెక్టర్ డా.సునీతానరైన్ చేతుల మీదుగా ఆదిభట్ల మున్సిపల్ కమిషనర్ ఎస్.బాలకృష్ణ, పర్యావరణ ఇంజనీర్ ఆర్.సురేష్ అవార్డు అందుకున్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

బషీరాబాద్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా, మద్యం సేవించి వాహనాలు నడిపిస్తూ పట్టుబడితే కఠినంగా చర్యలు తప్పవని బషీరాబాద్ ఎస్ఐ పి.శంకర్ వాహనదారులను హెచ్చరించారు. ఎస్పీ ఆదేశానుసారం గురువారం ఎస్సై బషీరాబాద్‌లోని రైల్వేస్టేషన్ కూడలిలో ఆటో, జీపు డ్రైవర్లతో సమావేశమయ్యారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్‌శాఖ అనేక చర్యలు చేపడుతున్నా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని గుర్తుచేశారు. మైనర్లకు తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలు ఇచ్చి రోడ్లపైకి పంపిస్తే భారీ జరిమానాతో పాటు కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

## ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు



తాండూరు డీఎస్పీ బాలకృష్ణ రెడ్డికి బారికేడ్లను అందజేస్తున్న ప్రైవేటు స్కూల్, కళాశాలల అసోసియేషన్ ప్రతినిధులు

తాండూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ బాలకృష్ణ రెడ్డి వెల్లడించారు. గురువారం తాండూరు ప్రైవేటు స్కూల్స్, జూనియర్ కళాశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం 20 బారికేడ్లను డీఎస్పీకి అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అతివేగం కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టాలంటే నియంత్రణ తప్పనిసరి అని చెప్పారు. ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. బారికేడ్లను అందించిన స్కూల్స్, కళాశాలల యాజమాన్యాలను ఆయన అభినందించారు. కళాశాలల సమీపంలో టీజింగ్‌కు పాల్పడకుండా షీటీం గస్తీ పెంచాలని కాలేజీల ప్రతినిధులు డీఎస్పీని కోరారు. సీఐ సంతోష్‌కుమార్ విజ్ఞప్తి మేరకు ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా బారికేడ్లను అందించినట్లు స్కూల్స్, కళాశాల యజమాన్య ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ప్రైవేటు కళాశాలల యాజమాన్య సభ్యులు రంగారావు, పర్యాద రామకృష్ణ, సంగీత, జి.నరేందర్, ఆనంద్, నర్సిములు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కార్యదర్శి మోహన్‌కృష్ణ, అగ్గనూర్ కిరణ్, వెంకట్‌రెడ్డి, ఇందూర్ రాములు, సతీష్, శివ, అభి, షాహెల్, యూనస్, వాహిద్, బాలస్వామి, కవిత, కల్పన, రమేష్, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కసిరెడ్డికి సమస్యలు వివరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్, రామకృష్ణ, నాయకులు

## పంట పొలాల మీదుగా హైటెన్షన్ విద్యుత్ లైన్ వద్దు

**ఎమ్మెల్యే కసిరెడ్డికి కడ్తాల రైతుల వినతి**

కడ్తాల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రైతులు సాగు చేసుకుంటున్న పంట పొలాల మీదుగా హైటెన్షన్ విద్యుత్ లైన్ ఏర్పాటును మార్పించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని స్థానిక నాయకులు కోరారు. గురువారం డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ ఉపసర్పంచ్ కడారి రామకృష్ణల ఆధ్వర్యంలో నాయకులు, రైతులు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కడ్తాల గ్రామాన్ని అనుసరించి 66 సర్వేనెంబర్లలోని 150 మంది రైతుల పంట పొలాల మీదుగా 765 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటుకు పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎల్‌అండ్‌టీ సంస్థ శ్రీకారం చుట్టి లైన్ మార్కింగ్ చేశారని ఎమ్మెల్యేకు తెలిపారు. బీదర్ నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు ఏర్పాటు చేసే కొత్త హైటెన్షన్ లైన్‌ను పొలాల మీదుగా ఏర్పాటు చేస్తే రూ.కోట్ల విలువైన భూములు కోల్పోయి రైతులు రోడ్డున పడుతారని నాయకులు తెలిపారు. రైతుల ఆవేదనను అర్థం చేసుకొని అలైన్‌మెంట్ మార్పించాలని శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్, రామకృష్ణలు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. అధికారుల దృష్టికి తీసుకుపోతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నాయకులు, రైతులు గూడూరు జంగారెడ్డి, గోరటి జంగయ్య, రాములు, మహేశ్వర్ రెడ్డి, తిరుపతిరెడ్డి, పాండు, రాజేశ్, తదితరులున్నారు.

### వెల్జాలను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి

**తలకొండపల్లి :** వెల్జాల గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని వెల్జాల, వెంకటాపూర్, చౌదర్‌పల్లి, మాదాయిపల్లి, అంతారం, జూలపల్లి, చంద్రధన, సంగాయిపల్లి గ్రామాల నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డిని కోరారు. ఈమేరకు గురువారం ఎమ్మెల్యే కసిరెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. వెల్జాల మండల కేంద్రం ఏర్పాటుకు అన్నివిధాలా అనుకూలంగా ఉంటుందని నాయకులు వివరించారు. మండల కేంద్రం ఏర్పాటుకు సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని కసిరెడ్డి హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఏఎంసీ డైరెక్టర్ చర్ల వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు శ్రీనివాసమూర్తి, అంబాజీ, నాయకులు, అంజయ్య గౌడ్, రమేశ్ యాదవ్, అజీజ్, నర్సిరెడ్డి, చెన్నారెడ్డి, అశోక్ బాబు, తదితరులు ఉన్నారు.

## టీడీపీ సభ్యత్వానికి విశేష స్పందన : బక్కని


గిరిమోని హన్మంతుకు సభ్యత్వాన్ని ఇస్తున్న బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమం, పేదరిక నిర్మూలన, పచ్చదనం-పారిశుధ్యం, జవాబుదారితో పనిచేసిన టీడీపీ పాలనను తిరిగి పల్లెల్లో ప్రజలు కోరుతున్నారని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు తెలిపారు. టీడీపీ సభ్యత్వానికి విశేష స్పందన వస్తుందని ఆయన తెలిపారు. ఈమేరకు గురువారం టీడీపీ సీనియర్ నాయకుడు గిరిమోని హన్మంతుకు పార్టీ సభ్యత్వాన్ని ఇచ్చారు. అనంతరం బక్కని విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను పల్లె ప్రజలు గుర్తుచేస్తున్నారని తెలిపారు. ప్రజా చైతన్యం తెచ్చి, నిజాయితీ పాలనను అందించామన్న ఆలోచనతో టీడీపీ సభ్యత్వానికి విశేష స్పందన వస్తున్నదని చెప్పారు. తెలంగాణలో అక్టోబరు 26న ప్రారంభమైన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు 95,400 మంది సభ్యత్వాలు తీసుకున్నారని తెలిపారు. టీడీపీ సభ్యత్వం తీసుకున్న ప్రతీ సభ్యుడికి రూ.5లక్షల ప్రమాదబీమా ఉంటుందని, సహజ మరణం సంభవిస్తే రూ.10 వేలు ఇస్తారని తెలిపారు. సీనియర్ నాయకుడు లింగారం కుమార్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే


లింగారెడ్డిగూడలో ఇళ్ల సర్వే చేస్తున్న అధికారులు

ఆమనగల్లు/షాద్‌నగర్ రూరల్/యాచారం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీ, మండల పరిధి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. అధికారులు ఇళ్లను పరిశీలించి అర్హుల వివరాలను మొబైల్ యాప్ లో నమోదు చేస్తున్నారు. సర్వేను గురువారం మున్సిపల్ కమిషనర్ వసంత, ఎంపీడీవో కు సుమమాధురి పరిశీలించారు. ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ ఇంటింటికి తిరిగి సర్వే చేశారు. రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపికచేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారని కార్యదర్శి తెలిపారు. ఆయనతో కాంగ్రెస్ నాయకులు రమేష్, మల్లేష్, హరికృష్ణ, శ్రీధర్‌గౌడ్, పకీర్ పాషా ఉన్నారు. యాచారం ఎంపీడీవో సర్వే బృందానికి సూచనలు చేశారు. యాచారంలో ఇళ్ల సర్వేను పరిశీలించారు. పేదల ఇళ్లకెళ్లి ఇల్లు కట్టుకునేందుకు స్థలం ఉందా? అని తెలుసుకున్నారు. యాచారం, చౌదర్‌పల్లి గ్రామాల్లో హరితహారం నర్సరీలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఈజీ ఎస్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్ శివశంకర్ రెడ్డి, పీఎస్ తిరుపతయ్య తదితరులు ఉన్నారు.


ఆమనగల్లులో సర్వే నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్

## కేటీఆర్‌పై అక్రమ కేసును ఖండిస్తున్నాం


మాజీ ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈరేస్ వ్యవహారంలో అక్రమాలు జరిగాయంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేసు పెట్టి ఏ1గా చేర్చటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిలో ఎక్కడ కూడా డబ్బులు కేటీఆర్ దుర్వినియోగం చేసిలేదని, హైదరాబాద్ ప్రతిష్ట పెంచే విధంగా ఈ కార్ రేసింగ్‌ను హైదరాబాద్‌కు తీసుకువచ్చిన ఘనత కేటీఆర్‌కు దక్కుతుందన్నారు. ఇటీవల లగచర్ల రైతులపై, మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డిపై కేసుల విషయం మరిచిపోక ముందే కేటీఆర్‌పై కేసు పెట్టడం అన్యాయమని అన్నారు. తమకు న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకం ఉందని తెలిపారు.

## పరిగిలో సీఎం దిష్టిబొమ్మ దహనం


సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

పరిగి: మాజీ మంత్రి కేటీఆర్‌పై ఫార్ములా ఈరేస్ సంబంధించి అక్రమ కేసు పెట్టడాన్ని నిరసిస్తూ, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి పరిగిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్, మాజీ ఎంపీపీ అరవింద్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, భాస్కర్, రవికుమార్, ఆసిఫ్ పాల్గొన్నారు.

## స్క్రాప్ లారీ డ్రైవర్ల నిరసన

పరిగి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నారాయణపూర్ శివారులోని సుగుణ స్టీల్ ఫ్యాక్టరీలో స్క్రాప్ లారీల డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. స్క్రాప్ లారీలను ఎందుకు అన్‌లోడ్ చేయడం లేదని యజమాన్యంతో వాగ్వివాదానికి దిగారు. స్క్రాప్ మెటీరియల్ క్వాలిటీ లేదని తీసుకోకపోవడంతో రెండు రోజుల నుంచి వచ్చిన లారీలు ఫ్యాక్టరీలోనే నిలిచిపోయాయి. దీంతో పోలీసులు వారికి నచ్చజెప్పారు.

# ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలేవి?

- రక్షణ చర్యలు శూన్యం
- ఇబ్బందుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు


ప్రహరీ లేని అప్పాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల

కొడంగల్ రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. విద్యావ్యవస్థ బలోపేతమే లక్ష్యంగా అభివృద్ధి పనులకు ప్రణాళికలతో ముందుకెళ్తోంది. అయితే కొన్ని చోట్ల ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారింది. కొడంగల్ మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేక రక్షణ కరువైంది. ప్రభుత్వం నూతనంగా పాఠశాలలు నిర్మిస్తున్నప్పటికీ ప్రహరీల నిర్మాణంపై చర్యలు తీసుకోవడం లేదు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని పాఠశాలలు రహదారి పక్కనే ఉండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు.

### మండలంలో ఇదీ పరిస్థితి

మండలంలో 37 ప్రాథమిక, 10 ప్రాథమికోన్నత, ఏడు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అందులో 4,524 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. నాలుగు పాఠశాలలకు పూర్తిస్థాయిలో ప్రహరీలు ఉండగా మరికొన్ని పాఠశాలల ముందు పహరీ ఉండగా వెనక వైపు ప్రహరీలు లేవు. అప్పాయిపల్లి, ఉడిమేశ్వరం, పాతకొడంగల్, పాతకొడంగల్, పలు గురాళ్ళ తండాలు, ఆలేడు, గుండ్లకుంట, హేసేన్‌పూర్, ప్యాలమద్ది, బుల్కపూర్, ఆశమ్మకుంట, మైసమ్మ, పోశమ్మకుంట తండాలు, పాటిమీదిపల్లి, నాగారం, బోయపల్లి, భవనమ్మ, బీమ్లీతండాలు, రావులపల్లి, రుద్రారం, లక్ష్మీంపల్లి, సంగాయిపల్లి, కొండారెడ్డిపల్లి, కొడంగల్ జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలతో పాటు మరికొన్ని పాఠశాలలకు ప్రహరీలేవు. చాలా చోట్ల కనీస సౌకర్యాలు లేక విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని పాఠశాలలు పొలాల పక్కనే ఉన్నాయి. మరికొన్ని పాఠశాల ఆవరణలో శునకాలు, పశువులు, పందులు సంచరిస్తూ అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. పాఠశాల ఆవరణలో పెంచిన మొక్కలను ధ్వంసం చేస్తున్నాయి. సెలవు రోజుల్లో మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. ప్రహరీలు లేక పాఠశాల స్థలం ఆక్రమణకు గురయ్యే అవకాశం ఉంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**ప్రతిపాదనలు పంపించాం**

కొడంగల్ మండలంలో ప్రహరీలు లేని పాఠశాలలను గుర్తించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. పాఠశాల ఆవరణల్లో ప్రహరీల నిర్మాణంతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

*- రాంరెడ్డి, ఎంఈవో, కొడంగల్*

# చిగురిస్తున్న ఆశలు!

(5వ పేజీ తరువాయి)

మంత్రి స్పష్టత ఇవ్వడంతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. రేషన్ కార్డుల కోసం జిల్లాలో 40 వేల మంది వరకు ఎదురు చూస్తున్నట్లు సమాచారం.

### కుటుంబ సభ్యుల ఆధారంగా

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల ద్వారా లబ్ధి పొందడానికి రేషన్ కార్డు తప్పనిసరిగా మారిన విషయం తెలిసిందే. రేషన్ కార్డులు ఉన్న పేద ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటున్నా.. తమ పరిస్థితి ఏమిటని కార్డులేని పేదలు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 2,41,179 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో 8,09,218 మంది సభ్యులు ఉన్నారు. ఆహార భద్రత కార్డులు 2,14,503, అంత్యోదయ ఆహార భద్రత కార్డులు 26,640, అన్నపూర్ణ అన్న యోజన కార్డులు 36 ఉన్నాయి. రేషన్ కార్డుదారుల్లో నమోదైన సభ్యుల సంఖ్య ఆధారంగా నెలనెలా రేషన్ పంపిణీ చేస్తున్నారు.

### కుటుంబ సభ్యులు పెరిగినా..

రేషన్ కార్డుల కోసం పేద ప్రజలకు ఎదురు చూపులు తప్పడం లేదు. కొత్త రేషన్ కార్డులు జారీ చేసే విషయం ఎలా ఉన్నా.. కనీసం ఆ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేసేందుకు కూడా అవకాశం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. రేషన్ కార్డుపై నమోదైన కుటుంబ సభ్యులకు అదనంగా పేర్లు చేర్చడం, లేదా తొలగించడానికి కూడా అవకాశం కల్పించలేదు. ఫలితంగా వివాహమైన కుటుంబంలో కొత్తగా చేరిన కోడళ్లు, జన్మించిన పిల్లల పేరు చేర్చాల్సి ఉండగా, వివాహమైన కూతురు, వేరు కాపురం పెట్టిన వారి వివరాలను రేషన్ కార్డులో నుంచి తొలగించాల్సి ఉండగా ఆ అవకాశం లేకుండాపోయింది. ఉద్యోగ రీత్యా లేదా ఇతర కారణాలతో ఉమ్మడి కుటుంబాల నుంచి విడిపోయి వేరుగా కాపురం పెట్టిన వారు కూడా కార్డులకు నోచుకోవడం లేదు. కుటుంబ సభ్యుల సంఖ్య పెరిగినా . ప్రభుత్వం సరఫరా చేసే రేషన్ పరిమాణంలో మాత్రం మార్పు లేదు. రేషన్ కార్డులో నమోదైన కుటుంబ సభ్యుల సంఖ్య ఆధారంగానే రేషన్ సరఫరా చేస్తున్నారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం లేకపోవడంతో పాత కోటా ప్రకారమే రేషన్ పంపిణీ చేస్తున్నారు.

**నెలనెలా సరుకుల పంపిణీ**

బియ్యం : 5,337.315 మెట్రిక్ టన్నులు
చక్కెర : 26,776 కిలోలు

## క్రైం కార్నర్

### వ్యక్తి అదృశ్యం


ప్రసాద్(ఫైల్)

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లింగాపూర్ తండాకు చెందిన కునుకుంట్ల ప్రసాద్(40) దమ్మాయిగూడ మున్సిపాలిటీ, బాలాజీనగర్‌లో కాంట్రాక్ట్ పనిచేస్తున్నాడు. ఈనెల 12వ తేదీన డబ్బులు, కారు తెచ్చేందుకు బెంగళూరు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి బయల్దేరాడు. ప్రసాద్ 15వ తేదీన ఇంటికి వీడియోకాల్ చేసి కారు, డబ్బులు ఇస్తామని చెప్పిన వారి వద్దకు వెళుతున్నానని, ఫోన్ సరిగ్గా పనిచేయడంలేదదని తర్వాత ఫోన్‌చేస్తానని చెప్పాడు. మరుసటి రోజు నుంచి ప్రసాద్ ఫోన్‌స్విచ్ఛాఫ్ వస్తోంది. దీంతో కుటుంబసభ్యులు, తెలిసిన వారిని, స్నేహితులను విచారించినా ఫలితం లేకపోవడంతో పోచారం ఐటీ కారిడార్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ప్రసాద్ భార్య కానుకుంట్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### నంబర్ ప్లేట్ లేని 14 వాహనాలు సీజ్


మన్నెగూడ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

పూడూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మన్నెగూడ జంక్షన్ వద్ద పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డితో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. ఈ తనిఖీలో 14 నంబర్ ప్లేట్లు లేని వాహనాలు పట్టుకుని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం సీఐ ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ తనిఖీల్లో ప్రొబిషనరీ ఎస్ఐలు కవిత, పూజ, సిబ్బంది పాల్గొన్నారు.

### అనుమతులు లేని క్లినిక్ సీజ్


నవాబుపేటలో రుక్మిణి క్లినిక్‌ను సీజ్ చేసిన వైద్యాధికారి రోహిత్

నవాబుపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఆర్ఎంపీ లక్ష్మణ్ నిర్వహిస్తున్న రుక్మిణి క్లినిక్‌ను మండల వైద్యాధికారి రోహిత్ గురువారం సీజ్ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురి ఫిర్యాదు మేరకు వైద్యాధికారి రోహిత్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా రోగులకు చికిత్సలు నిర్వహిస్తుండటంతో సీజ్ చేశారు. సీహెచ్‌వో రఫీ, వైద్య సిబ్బంది ఉన్నారు.

## పర్వత్‌పల్లిలో నీటి కష్టాలు


పర్వత్‌పల్లిలో నీటి కోసం గుమిగూడిన జనం

బషీరాబాద్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పర్వత్‌పల్లి గ్రామంలో ప్రజలు నీటి కష్టాలు పడుతున్నారు. మిషన్‌భగీరథ నీరు సరిపోక, డైరెక్టు పంపింగ్ ద్వారా ట్యాంకులకు నీటి సరఫరా జరుగక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు చోట్ల డైరెక్టు పంపింగ్ బోర్లు ఉన్నప్పటికీ నీరెందుకు వదడంలేదోనని స్థానికులు పలువురు మండిపడుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మౌనికను అడగగా మోటర్ కేబుల్ వైరు ఖాళీ బోరు మరమ్మతుకు గురైందని చెప్పుకొచ్చారు. ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



## అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు


అంబేడ్కర్ చౌరస్తాలో మాట్లాడుతున్న అంబేడ్కర్ సంఘం, యూత్ కాంగ్రెస్ నాయకులు

కొడంగల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని అంబేడ్కర్ సంఘం నాయకులు అన్నారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో గురువారం అంబేడ్కర్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు, యూత్ కాంగ్రెస్ జాతీయ కో ఆర్డినేటర్ కృష్ణంరాజు మాట్లాడుతూ అంబేడ్కర్ అంబేడ్కర్ అని పదేపదే అనడం ఇప్పుడు ఓ ఫ్యాషన్‌గా మారిందని, దీనికి బదులుగా దేవుడిని ఇన్నిసార్లు స్మరిస్తే స్వర్గానికి వెళ్లొచ్చని అమిత్‌షా అనడం బాధాకరమనిన్నారు. అమిత్‌షాను కేంద్ర మంత్రి పదవీని నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమంతు, శ్రీనివాస్, సాయిలు, మోహన్, చిన్నయ్య, వెంకటయ్య, జగన్‌మోహన్, కాశీనాథ్ పాల్గొన్నారు.

**తాండూరు:** రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానపరిచే విధంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను వెంటనే విరమించుకోవాలని, కేంద్ర మంత్రి పదవికి రాజీనాయా చేయాలని పేర్కొంటూ గురువారం తాండూరు అంబేడ్కర్ చౌక్‌లో బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.

**పూడూరు:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని జాతీయ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ అవార్డు గ్రహీత కోళ్ల యాదయ్య, కాంగ్రెస్ పూడూరు మండల అధ్యక్షుడు బి.సురేందర్ డిమాండ్ చేశారు.

**అమిత్‌షా క్షమాపణలు చెప్పాలి**


డీసీసీ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

పరిగి: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానపరుచడాన్ని దేశం సహించదని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రమంత్రి అమిత్‌షా అధికార అహంకారంతో అంబేడ్కర్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అంబేడ్కర్ జీవితచరిత్ర, సిద్ధాంతాలు తెలియని అమిత్‌షా అవమానపరిచేలా ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. అమిత్‌షా బేషరుతగా క్షమాపణలు చేప్పాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అంబేడ్కర్‌పై వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్‌షాను దేశం నుంచి బహిష్కరించాలని బీఎంపీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్ డిమాండ్ చేశారు. పరిగిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ జీవిత చరిత్ర తెలియని మూర్ఖుడు అమిత్‌షా అని విమర్శించారు. ఓట్లు, సీట్లు, నోట్లు ఉద్దేశంతో రాజకీయం చేస్తున్న అమిత్ షా చట్టసభల్లో ఉండే అర్హత లేదన్నారు. ఈ సమావేశంలో బీఎంపీ జిల్లా ఉపాధ్యక్షుడు హరినాయక్, రాజన్న, చేవెళ్ళ పార్లమెంట్ ఇన్‌చార్జి గోవింద్‌నాయక్, నాయులు రవీందర్‌నాయక్, అరుణ్, రవి, బాబ్యు, పాల్గొన్నారు.

## కార్యాలయాల నిర్మాణానికి స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

బొంరాస్‌పేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండలంలో కార్యాలయాల నిర్మాణానికి అధికారులు స్థల పరిశీలన చేశారు. కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం మండలంలోని హకీంపేట్‌లో పర్యటించారు. తాత్కాలిక పోలీస్‌స్టేషన్ కోసం పల్లె దవాఖానాను పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల నిర్మాణం కోసం ఉన్నత పాఠశాల ఆవరణలో స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కిషన్‌నాయక్, పంచాయతీ రాజ్ ఏఈ సురేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## కోట్‌పల్లి పోలీస్‌స్టేషన్ తనిఖీ

బంట్వారం(కోట్‌పల్లి) డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): కోట్‌పల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను గురువారం వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో పలు కేసులు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ధారురు సీఐ రఘురాములు, కోట్‌పల్లి ఎస్ఐ స్రవంతి ఉన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

## సంక్షిప్తంగా..

**అభివృద్ధి కోసమే ఎన్నికల్లో పోటీ**

**ఘట్‌కేసర్:** సంస్కృతి టౌన్‌షిప్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అందరి అభిప్రాయం మేరకే మరోసారి ఎన్నికల బరిలో ఉన్నానని పోచారం సంస్కృతి టౌన్‌షిప్ అధ్యక్షుడు బెజ్జంకి హరిప్రసాదరావు అన్నారు. ఆయన టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 22వ తేదీన సంస్కృతి టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు జరుగుతున్నట్లు తెలిపారు.

**ఘనంగా కొరివి కృష్ణస్వామి వర్ధంతి**

**పరిగి:** హైదరాబాద్ తొలిమేయర్ కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ 57వ వర్ధంతిని గురువారం పరిగిలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. పరిగిలోని టెలిఫోన్ ఏక్చేంజి దగ్గర ఉన్న కృష్ణస్వామి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.నాగేశ్వర్, జిల్లా ప్రధానకార్యదర్శి డి.మాణిక్యం, డి.కృష్ణ, బాలు, యాదయ్య, నారాయణ పాల్గొన్నారు.

**ఐపీఈలో 21న అలూమ్ని మీట్**

**శామీర్‌పేట:** శామీర్‌పేటలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైస్ (ఐపీఈ) కళాశాల్లో ఈ నెల 21న మధ్యాహ్నం 3 గంటలకు అలూమ్ని మీట్-2024 (పూర్వ విద్యార్థుల సమ్మేళనం) కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల డైరెక్టర్ శ్రీనివాసమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా ఐపీఈ గవర్నింగ్ బోర్డు మెంబర్, బెల్ మాజీ సీఎండీ ప్రసాదరావు విచ్చేస్తున్నట్లు ఆయన వివరించారు.

**ప్రభుత్వ ఆదాయంపై వర్క్‌షాప్**

**శామీర్‌పేట:** స్థానిక ప్రభుత్వ గురుకుల మహిళ డిగ్రీ కళాశాల్లో గురువారం 'మనీ ట్రయల్-ప్రభుత్వ ఆదాయం' అంశంపై కళాశాలకు చెందిన సంబంధిత అధ్యాపకులు విద్యార్థులకు వన్ డే వర్క్‌షాప్‌ను నిర్వహించి అవగాహన కల్పించారు. కళాశాలకు చెందిన కామర్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ వైడి రాజ్యలక్ష్మీ వర్క్‌షాప్ ను ప్రారంభిస్తు ప్రభుత్వానికి ట్యాక్స్ ఇన్‌కమ్ ఎలా వస్తుంది, ప్రభుత్వానికి ఎక్కడి నుంచి ఆదాయం వస్తుంది అనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

**నర్సరీలో మొక్కలను సిద్ధం చేయాలి**

**కులకచర్ల:** వచ్చే వర్షాకాలం నాటికి మొక్కలు నాటేందుకు సిద్ధంచేయాలని ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. కామునిపల్లిలో గురువారం నర్సరీని పరిశీలించారు. విత్తనాలు నాటేందుకు మట్టి నింపుతున్న కవర్లను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

**మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులుకు సన్మానం**

**కులకచర్ల:** కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులును గురువారం తెలంగాణ రాష్ట్ర మహాసభ కమిటీ ముదిరాజ్ నాయకులు సన్మానించారు. చైర్మన్ ఆంజనేయులు తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు.

**చదువులతో పాటు క్రీడల్లో రాణించాలి**

**ఘట్‌కేసర్ రూరల్:** విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని ప్రతాప్‌సింగారం జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ తెలిపారు. సీఎం కప్ ఖో-ఖో పోటీల్లో ప్రతాప్‌సింగారం క్రీడాకారులు ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నారు. దీంతో పాఠశాలలో గురువారం ఆయన క్రీడాకారులను అభినందించారు.

**విద్యార్థులు చైతన్యవంతులవ్వాలి**

**మేడ్చల్ టౌన్:** గురుకులాల విద్యార్థినులు చైతన్యవంతులు కావాలని మేడ్చల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జి.లలిత అన్నారు. వాయిస్ 4 గర్ల్స్ అనే ఎన్‌జీవో సంస్థ వారు గురుకుల పాఠశాలలో గురువారం యుక్తవయను విద్యార్థునిలను చైతన్య పరిచే కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ దుర్గ సత్యవతి, క్యాంప్ కోఆర్డినేటర్ ఎస్.హెమావతి, ఫీల్డ్ కోఆర్డినేటర్ సంజన, కౌన్సిలర్ అనన్య పాల్గొన్నారు.

**బూత్ కమిటీ అధ్యక్షుల నియామకం**

**ధారూరు:** బీజేపీ ధారూరు గ్రామ బూత్ కమిటీల అధ్యక్షులను నియమించింది. ధారూరులో గురువారం ఆ పార్టీ నాయకులు సమావేశం నిర్వహించి బూత్ నెంబర్ 212కు దుబ్బ మల్లేశం, 213కు జి.సంతోష్‌కుమార్, 214 రాఘవేందర్ గౌడ్‌లను బూత్ అధ్యక్షులుగా ఎన్నుకుని వీరికి నియామకం పత్రాలు అందజేశారు.

## 15,596 ఎకరాల్లో సాగు

(5వ పేజీ తరువాయి)

సాగు బోరు బావులపైనే ఆధారపడి ఉంది. ఈసారి వర్షాలు కూడా సమృద్ధిగా కురవడంతో బోరు బావుల్లో నీరు పుష్కలంగా ఉంది. దీంతో ఈ సీజన్‌లో 15,596 ఎకరాల్లో పంటలు సాగు చేయనున్నట్లు అంచనా వేస్తున్నారు.

### 1,200 ఎకరాల్లో కూరగాయలు

ఈ యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 13,788 ఎకరాల్లో వరి పంట సాగుచేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. 2023-24 యాసంగిలో వరి సాగు 14,003 ఎకరాల్లో సాగు చేశారు. కాగా, ఈ సీజన్‌లో కాస్త తగ్గనున్నట్లు అంచనా వేశారు. ఉద్యాన పంటలు కూరగాయలు, ఆకు కూరలు, పూలు, పండ్ల తోటల 1,795 ఎకరాల్లో సాగు అవుతుందని అధికారులు ప్రణాళిక రూపొందించారు. నగర శివారులో ఉండటంతో రైతులు కూరగాయలు, పండ్లు, పువ్వుల సాగుకు మొగ్గు చుపుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో దాదాపు 1,200 ఎకరాల్లో కూరగాయలైన చిక్కుడు, బీర, కాకర, టమాట వంటి పంటలు, అలాగే మిర్చి, వంకాయ, బెండ, ఆకు కూరలు సాగు చేయనున్నట్లు అంచనా వేశారు.

**రైతులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు**



జిల్లాలో పంటల సాగు విస్తీర్ణంను అనుసరించి అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచాం. 11,241 క్వింటాళ్ల వరి విత్తనాలు, 11 క్వింటాళ్లు మొక్కజొన్న, 14 క్వింటాళ్లు జవార్ విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. అలాగే యూరియా 2,300 మెట్రిక్ టన్నులు, డీఏపీ 635 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 247 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయి. రైతులు విత్తనాలు, ఎరువులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశాం. *- చంద్రకళ, జిల్లా వ్యవసాయాధికారి*

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


బహుమతులను ప్రదానం చేస్తున్న కళాశాల ప్రతినిధులు

ఘట్‌కేసర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు క్రీడలు, సాహిత్యం వంటి అన్ని రంగాల్లో రాణించాలని సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ మల్లాది రమాకాంత్‌రెడ్డి అన్నారు. కొండాపూర్‌లో గల సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో కళాశాలల బ్లాక్‌స్థాయి క్రీడాపోటీలు ఘనంగా నిర్వహించారు. వాలీబాల్‌లో కేపీఆర్‌ఐటీ జట్టు, కబడ్డీలో విజ్ఞాన్ ఉమెన్స్ కళాశాల జట్టు, బ్యాడ్మింటన్ బాలురలో సంస్కృతి కళాశాల జట్టు, విజేతలుగా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనకిరాములు, శ్రవణ్, శివకేశవరెడ్డి, నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి ఐనయ్య, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల సర్వే పక్కాగా చేపట్టాలి

బషీరాబాద్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను పక్కాగా చేపట్టాలని బషీరాబాద్ ఎంపీడీవో విజయ్‌కుమార్ సూచించారు. మండలంలోని మంతట్టిలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి కార్యదర్శి అమృతప్పతో చర్చిస్తూ ప్రజాపాలన దరఖాస్తుల జాబితా ఆధారంగానే ఇంటింటా ప్రత్యేక యాప్‌లో వివరాలను పమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట ఈజీఎస్ ఈసీ నర్సింహారెడ్డి తదితరులున్నారు.

**మోమిన్‌పేట్:** ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో విజయలక్ష్మీ సూచించారు. మండలంలోని మేకవనంపల్లి లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను గురువారం ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుగుణ పాల్గొన్నారు.

**బొంరాస్‌పేట్:** పేదోడి కల నేర్చేవందుకు సొంతింటి నిర్మాణం కోసం ఇందిరమ్మ ఇళ్ల సర్వే జోరుగా కొనసాగుతోంది.మండల కేంద్రం బొంరాస్‌పేట్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులు గౌడ్ ఆధ్వర్యంలో గురువారం సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో వెంకన్నగౌడ్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకట్రాములుగౌడ్, రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

**దోమ:** మండలంలోని రాకొండ, మోత్కూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీవో మహేశ్‌బాబు గురువారం పరిశీలించారు. సర్వేలో అర్హులైన వారిని గుర్తించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం పాల్గొన్నారు.

## మాల మహానాడు నాయకుల ముందస్తు అరెస్టు


మాలమహానాడు నాయకులను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ ముట్టడి సందర్భంగా మండలంలోని మాల మహానాడు నాయకులను ఘట్‌కేసర్ పోలీసులు ముందస్తుగా అరెస్టుచేశారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు పడిగెం ఆంజనేయులు మాట్లాడుతూ మాలలను ప్రభుత్వం అణచివేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్నం వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షుడు మల్లేష్, కార్యదర్శి మురళిమోహన్, నాయకులు నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

**తాండూరు రూరల్:** ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం తాండూరు మండలం నుంచి అసెంబ్లీ ముట్టడికి వెళుతున్న నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అనంతరం వారిని కరన్‌కోట్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో బీఎస్పీ శాణప్ప, కృష్ణకుమార్, మల్లప్ప, జగదీష్, విజయ్‌కుమార్, గోవింద్ ఉన్నారు.

**యాలాల:** అసెంబ్లీ ముట్టడికి యాలాల మండలం నుంచి తరలి వెళుతున్న మాల మహానాడు నాయకులను పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోలీసు స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో కొత్తింటి నర్సింహులు, ఎర్ర హన్మంతు, యాలాల అశోక్, మాల మారుతి, మాల రమేష్ తదితరులున్నారు.

## బంట్వారం ఎస్ఐగా శ్రీశైలం


ఎస్ఐ శ్రీశైలం

బంట్వారం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బంట్వారం నూతన ఎస్ఐగా శ్రీశైలం గురువారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ లో భాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో దౌల్తాబాద్‌లో విధులు నిర్వహిస్తు సాధారణ బదిలీల్లో భాగంగా బంట్వారం ఎస్ఐగా వచ్చారు.

## జీవన ప్రమాణాలు పెంపొందించుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు జీవన ప్రమాణాలను పెంపొందించుకోవడానికి కృషిచేయాలని ఎదులాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఫైన్ ఆర్ట్స్ ప్రిన్సిపాల్ రాము తెలిపారు. పాఠశాలలో నిర్వహించిన బాయ్స్ ఫర్ చేంజ్ అనే అవగాహన కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు జీవన ప్రమాణాలు, నాణ్యమైన విద్య, ప్రాథమిక హక్కులు, అహింసా, భద్రత అనే అంశాలపై విద్యార్థి దశలోనే తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాయ్స్ ఫర్ చేంజ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.